www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 19 జూలై 2025
5
వైఎస్ఆర్



వైవీయూ స్నాతకోత్సవానికి గవర్నర్‌ను ఆహ్వానించిన విసి

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం 11, 12, 13, 14వ స్నాతకోత్సవానికి నిర్వహణ కోసం అనుమతి ఇవ్వాలని, అలానే తమరు కులపతి హోదాలో హాజరుకావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు కలిసి విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని రాజభవన్‌లో వైవీయూ విసి గవర్నర్‌ను కలిశారు. మొక్కను అందజేసి దృశ్యాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కడప జిల్లాలోని యోగివేమన విశ్వ విద్యాలయం గురించి గవర్నర్‌కు వివరించారు. గవర్నర్ స్పందిస్తూ ఆగస్టు చివరి వారంలో లేదా సెప్టెంబర్ మొదటి వారంలో కాన్వకేషన్ నిర్వహించుకోవాలని ఆయా తేదీల వివరాలు తమ కార్యాలయానికి తెలియజేయాలని ఆదేశాలు ఇచ్చారు. తప్పక హాజరవుతానని చెప్పారని విసి తెలిపారు. విసి వెంట విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు ఉన్నారు.

తొలగని 'మహా' సంకటం

- మహానాడు ఖర్చు జిల్లా అధికారుల మెడకు!
- ప్రతి డిపార్టుమెంట్‌కు రూ.లక్షల్లో వ్యయం
- వ్యయ సేకరణకు మంత్రుల మోకాలడ్డు
- అమాత్యుల పేషీల నుంచి ఫోన్లు

జిల్లాలో టిడిపి మహానాడు వేడి సెగలు తగ్గడం లేదు. జిల్లాలోని పలు మెడికల్ సంస్థల నుంచి జిల్లా స్థాయి ఉన్నతాధికారుల వరకు తప్పని పరిస్థితి కనిపిస్తోంది. ఈ ఏడాది మే నెల 27, 28, 29వ తేదీల్లో కడపలో టిడిపి మహానాడును నిర్వహించిన సంగతి తెలిసిందే. మహానాడును జయప్రదం చేయడానికి రాష్ట్రానికి చెందిన పలువురు మంత్రులు వారం రోజుల పాటు జిల్లాలో మకాం వేశారు. వసతి, భోజన, ఇతర ఏర్పాట్ల ఖర్చులను ఆయా డిపార్టుమెంట్లకు చెందిన జిల్లా అధికారుల మెడకు చుట్టినట్లు తెలుస్తోంది. మహానాడు ముగిసిన అనంతరం మంత్రులు ఖర్చులను చెల్లించని నేపథ్యం చర్చనీయాంశంగా మారింది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో టిడిపి మహానాడు కార్యక్రమ వేడి చల్లారలేదు. రాష్ట్రంలోని సుమారు 32 మందికిపైగా మంత్రులు, అనుచరులు, పిఎలు పెద్ద ఎత్తున జిల్లాకు చేరుకున్న సంగతి తెలిసిందే. జిల్లాలోని ఆయా డిపార్టుమెంట్లకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు పార్టీ కార్యక్రమం అయినప్పటికీ సంబంధిత శాఖల మంత్రులు, అనుచరులు, పిఎల ఖర్చులను సొంతంగానే భరించారు. ప్రతి ఉన్నతాధికారి డిపార్టుమెంట్ తరపున వసతి, భోజన, ఇతర సదుపాయాల కల్పనకు సుమారు రూ.రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

రూ.90 లక్షలు భరించేదెలా!

జిల్లాలోని 32పైగా డిపార్టుమెంట్ల ఉన్నతాధికారులు సగటున రూ.రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకు ఖర్చు చేశారు. ఈలెక్కన సగటున రూ.90 లక్షల నుంచి రూ.కోటి వరకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. మహానాడుముగిసిన అనంతరం రూ.రెండు లక్షలకుపైగా ఖర్చు చేసిన అధికారులు కొన్ని కాంట్రాక్టు పనులకు ఆమోదం పొందడం ద్వారా పెట్టుబడిని భర్తీ చేసుకున్నారు. భర్తీకి అవకాశం లేని కొన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని డివిజనల్, మండల స్థాయి అధికారులను కొంత షేర్ చేసుకోవాలని కోరడంతో ఆలస్యంగా వెలుగులోకి రావడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇంతటి పరిమాణంలో కూడిన ఖర్చులను జిల్లా ఉన్నతాధికారులే భరించడం సాధ్యం కాదని, తమ జీతాల్ని పూర్తిగా ఖర్చు చేయాల్సి వస్తోందని, మిగిలిన అధికారులు సైతం పంచుకోవడం ద్వారా తేలిక అవుతుందని చెబుతున్నట్లు సమాచారం.

వసూళ్లపై పిఎల గరంగరం

మహానాడు ఖర్చులను షేర్ చేసుకోవాలనడంపై డివిజనల్ అధికారుల్లో వ్యతిరేకత దారితీయడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలోని ఆయా మంత్రులకు డివిజన్ అధికారులు షేర్ చేసుకోవాలనే సమాచారం చేరినట్లు సమాచారం. ఆయా మంత్రుల పిఎల కింది స్థాయి అధికారుల నుంచి డబ్బులు వసూలు చేయడాన్ని ఫోన్ల ద్వారా చేస్తుండడంపై ఉన్నతాధికారులు విస్తుపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు మంత్రులు, పిఎలనుద్దేశించి మీ ఖర్చులు మీరు భరించుకుండా, ఉన్నతాధికారుల నెత్తిన రుద్ది, పెట్టిన ఖర్చులను మిగిలిన అధికారులకు షేర్ చేయొద్దంటే ఎలా, తాము ఎక్కడి నుంచి పెట్టిన డబ్బుల్ని తీసుకురావాలని నసుగుతున్న నేపథ్యం కనిపిస్తోంది.

విద్యార్థిని హత్య కేసులో కన్పించని పురోగతి

- తప్పు ఒకరిది..తలనొప్పి మరొకరికి..
- డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ తనిఖీలు అట్టర్ ప్లాప్
- మకాం మార్చిన పోలీసులు
- గండికోట, హనుమన్‌గుత్తిలో విచారణ



విద్యార్థిని మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గండికోటలో ఈ నెల 14న చోటు చేసుకున్న ఇంటర్ విద్యార్థిని హత్య రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆరు రోజులైనా కేసు చేధనలో పురోగతి కన్పించడం లేదు. తప్పు చేసింది ఒకరు.. తలనొప్పి మరొకరికి అన్నట్లు హత్య కేసు ఉదంతం నడుస్తుంది. తప్పు చేసిన వారు సంతోషంగా ఉన్నారో, లేక భయందోళనలో ఉన్నారో తెలియదు కానీ పోలీసులకు మాత్రం జిల్లా ఎస్‌పి నుంచి కింది స్థాయి అధికారుల వరకు తలనొప్పిగా మారింది. అమ్మాయి చనిపోయిన రోజు వచ్చిన డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ల శ్రమ వృథా కావడంతో కేసు ను ఎలా చేదించాలో అర్థం కాక తలపట్టుకొని సిసి కెమెరాలను, కాల్ డేటాను చూస్తున్నారు. గండికోటలో హోటల్, అంగళ్లు, యజమానులను, బయట తిరిగే వ్యక్తులను ముమ్మరంగా శుక్రవారం పోలీసులు వెళ్లి విచారణ చేపట్టారు. మరోవైపు హనుమన్ గుత్తిలో కూడా విచారణ చేపట్టారు. ప్రొద్దుటూరుకు మకాం మార్చి బంధువులను విచారిస్తున్నారు. దాదాపు 150 మందికి పైగా పోలీసులు వివిధ బృందాలుగా మారి నిందితుల సమాచారం కోసం గాలిస్తున్నారు. జమ్మలమడుగు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో దాదాపు 20 నుంచి 30 వరకు కంప్యూటర్లను ఏర్పాటు చేసుకుని వివిధ ప్రదేశాల నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలతో సిసి ఫుటేజ్‌లను కాల్ డేటాను చూస్తూ సాంకేతికంగా పరిశీలిస్తున్నారు. ప్రతిష్ట కోసం అన్న, అమ్మ, నాన్నలు లేదా బంధువులు చంపారా ? లేక ప్రేమికుడి (లోకేష్) స్నేహితుల బృందం చంపారా? అనే కోణంలో పోలీసులు అనుమానితులను ప్రొద్దుటూరు , జమ్మలమడుగు స్టేషన్లకు పిలిపించి విచారిస్తున్నారు. నాలుగు రోజులైనా సమాచారం దొరకక పోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకోవడం లేదు. మరో వైపు పోలీసులు కేసును నీరు గారిస్తున్నారా అనే అనుమానాలను కూడా ప్రజలు లేవనెత్తుతున్నారు. డిఐజి వచ్చి తప్పుడు సమాచారం ఇప్పించి వెళ్లారా?, లేక అతని చేత తప్పుడు సమాచారం పోలీసులు ఇప్పించారా అని కూడా చర్చించుకుంటున్నారు. కీలక ఆధారం దొరికిందని చెప్పిన వారు రెండు, మూడు రోజులు పూర్తయినా ఎందుకు చెప్పలేదని ప్రశ్నిస్తున్నారు. కేసులో ఎప్పుడు పురోగతి లభిస్తుందోనని పలువురు చర్చించుకుంటున్నారు.

కొనసాగుతున్న క్రికెట్ మ్యాచ్‌లు



తలపడుతున్న కడప, కర్నూల్ జట్లు

ప్రజాశక్తి - కడప

అండర్ -16 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కడప, కర్నూలు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ హోరాహోరీగా సాగుతోంది. మొదటి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 157 పరుగులు చేసింది. 3 వికెట్ల నష్టానికి 54 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 51.2 ఓవర్లలో 114 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని సిఎండి ఫైజాన్ 40, కశ్యప్ రెడ్డి 23 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని రుత్విక్ కళ్యాణ్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి ఐదు వికెట్లు తీసుకున్నాడు. సాయి విగ్నేష్ రెండు, వివేక్ రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 57.5 ఓవర్లలో 140 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ చెట్టులోని రోహిత్ గౌడ్ 51, హరిహరాన్ 22 పరుగులు చేశారు. కడప జట్టులోని జయ ప్రణవ్ శాస్త్రి మూడు, చెన్నకేశవ రెండు, గైబు రెండు వికెట్లు తీసుకున్నారు.

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న వేరొక మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 203 పరుగులు చేసింది. ఆరు వికెట్ల నష్టానికి 93 పరుగుల ఓవర్ నైట్ స్కోర్ తో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 60.2 ఓవర్లలో 203 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని కిరణ్ కుమార్ 66, సాత్విక్ 23 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని నేత్రానంద నాలుగు, విక్రాంత్ రెడ్డి రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 61.0 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసింది. ఆ జట్టులోని గురు 66, రిషి కుమార్ రెడ్డి 57 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని దేవాన్ష్ 3 వికెట్లు తీసుకున్నాడు.

సమ్మెను ఉధృతం చేస్తాం



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ ఇంజినీర్ కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో, సమ్మె ఉధృతం చేస్తామని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య హెచ్చరించారు. శుక్రవారం నాటికి సమ్మె ఆరవ రోజుకు చేరుకుంది. కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు రూ.21వేలు, రూ.24,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలైన తల్లికి వందనం, రేషన్ కార్డులు, మున్సి పల్ ఆప్కాస్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని చెప్పారు. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన జీవో 36 ప్రకారం మున్సి పల్ ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని తెలిపారు. చలో సిడిఎంఎ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో ఇంజినీరింగ్ కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారని పేర్కొన్నారు. ఒకట్రెండు రోజుల్లో చర్చలు జరిపి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారని చెప్పారు. ప్రభుత్వము అధి కారులు, మంత్రులు ఉన్న జీవో ఇంప్లిమెంట్ చేయ డానికి ఇన్ని రోజులు అవసరమా అని ప్రశ్నించారు. ఒకటి రెండు రోజుల లోపల మున్సిపల్ ఇంజి నీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం చేయకపోతే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నగర ప్రజలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను శాంతి యుతంగా చేస్తున్నామని చెప్పారు. సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని, లేని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. విజయ భాస్కర్, జిల్లా కోశాధికారి ఎస్.గోపి, ఉపాధ్యక్షుడు తిరుపాల్, ఆనంద రావు, బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ నగర్ అధ్యక్ష, కార్యదర్శులు సుంకర రవి, వై.ఎం.కేశవులు, నగర నాయకులు ఇత్తడి ప్రకాష్, డ్రైవర్స్ నాయకులు సుంకర కిరణ్, చిన్న రాయుడు, వీరనారాయణ, బద్రి రామ్మోహన్ రెడ్డి, రామ చంద్రయ్య, సుబ్బరాయుడు, గురువయ్య, సునీత, ధరణి, మస్తానమ్మ, శ్యాంబాబు, నాగరాజు, సురేంద్ర, రామచంద్రారెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - కడప అర్బన్



శేషగిరిరావును సంఘంలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

యుటిఎఫ్ బలోపేతానికి కృషి చేస్తానని పసుపుల శేషగిరిరావు యుటిఎఫ్ లో చేరారు. శుక్రవారం కడపలోని యుటిఎఫ్ భవన్‌లో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్‌బాబు ఆధ్వర్యంలో ఆయన యుటిఎఫ్ లో చేరారు. ముందుగా యుటిఎఫ్ నాయకులు శేషగిరిరావు విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు కలిగిన వ్యక్తి అని పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఉపాధ్యాయ సంఘ నాయకునిగా, ఉపాధ్యాయ సంక్షేమానికి పాటుపడ్డాడన్నారు. ఉపాధ్యాయ సంఘం నాయకునిగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా పలు సామాజిక కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారన్నారు. ఆయన చేరికతో యుటిఎఫ్ మరింత బలోపేతం అవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం శేషగిరిరావు మాట్లాడుతూ యుటియఫ్ భావ జాలానికి, తన భావజాలానికి దగ్గరి సంబంధం ఉన్నప్పటికీ కొన్ని కారణాలవల్ల ఇతర సంఘాలలో పనిచేయాల్సి వచ్చిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల యుటిఎఫ్ రాజీలేని సమరశీల పోరాటాలను నిర్వహిస్తుండటం, సంఘం సిద్ధాంతాలకు ఆకర్షితుడనై యుటిఎఫ్‌లో చేరానన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు డి.సుజాతరాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.రూతు ఆరోగ్య మేరి, పెండ్లిమర్రి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.సుబ్బారావు, కె.సూర్య కుమార్, కడప నగర ప్రధాన కార్యదర్శి హిఫాజుతుల్లా, నాయకులు శివ శంకర్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ అమలు చేయాలి.. డిఎస్‌సి -2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వద్ద డిఎస్‌సి-2003 ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి తిరుపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా మాట్లాడుతూ అప్పట్లో కేంద్రంలో ఉన్న పాలకపక్షం, ప్రతిపక్షం పెన్షన్ భారాన్ని తగ్గించుకోవటానికి కొత్త పెన్షన్ విధానాన్ని తీసుకువచ్చారని తెలిపారు. 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఈ సిపిఎస్ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేశారని పేర్కొన్నారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 2003లో డిఎస్‌సి నోటిఫికేషన్ పాత పెన్షన్ విధానంతో ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. గత కాంగ్రెస్, టిడిపి, వైసిపి ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తూ వెంటనే ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

స్వచ్ఛందంగా రక్తదానం

ప్రజాశక్తి -కడప అర్బన్ : కడప ఐటిఐ సర్కిల్ బాలాజీ నగర్ రోడ్ నంబర్ 13 నెహ్రూ కేంద్ర యూత్ హాస్టల్‌లో కడప జిల్లా స్వచ్ఛంద సేవ సంస్థలు, ఖూన్ కా రిష్టా చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా స్టెప్ సిఇఒ సాయి గ్రేస్,పైడి కాల్వ విజయ్ కుమార్ ఖూన్ కా రిష్టా చైర్మన్ యం.తారీఖ అలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయి గ్రేస్ మాట్లాడుతూ జిల్లాలోని స్వచ్ఛంద సేవా సంస్థలు ఐక్యమతంతో కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఖూన్ కా రిష్టా చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలోని స్వచ్ఛంద సేవకులు వారం రోజులు పాటు నిర్వహించిన రక్తదాన శిబిరాల్లో ఇప్పటివరకు 315 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడం చాలా సంతోషకరమని చెప్పారు. ఐకమత్యంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. అనంతరం స్వచ్ఛంద సేవా ప్రతినిధులను సత్కరించారు.

మా అనుభవంలోనే భూమి

ప్రజాశక్తి-కడప అర్బన్



మాట్లాడుతున్న జవ్వాద్

ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాలకు సంబ ంధించిన 2.52 ఎకరాల భూమి తమ ఆధీనంలోనే ఉందని, కొందరు 'భూమి మాది' అంటూ చేస్తున్న ఆరో పణల్లో వాస్తవం లేదని కళా శాల సెక్రటరీ, కరస్పాండెంట్ జవ్వాద్ పేర్కొన్నారు. శుక్రవారం మెడికల్ కళాశాలలోని సెక్రటరీ చాంబర్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005వ సంవత్సరంలో భూ యజమాని వద్ద నుంచి 2.52 ఎకరాల భూమి కొనుగోలు చేశానని తెలిపారు. దీనికి సంబంధించిన మధ్యవర్తి వెంకటసుబ్బయ్యకు ఈ విషయం తెలుసని చెప్పారు. డాక్యుమెంట్లో 1.25 ఎకరాలు రిజిస్టర్ అయిందని, 1.25 ఎకరాలు మిస్ ప్లేస్ అయి ఉందని పేర్కొన్నారు. దీనికి కూడా తాము డబ్బు చెల్లించామని చెప్పారు. తాము కొనుగోలు చేసిన తర్వాత బైపాస్ రోడ్డు రావడంతో భూమికి డిమాండ్ పెరిగిందని తెలిపారు. బైపాస్ రోడ్డులో తమ స్థలం పోయిందని, దీనికి నష్టపరిహారం ప్రభుత్వం తమకే చెల్లించిందని పేర్కొన్నారు. ఒకటిన్నర సంవత్సరం కిందట ఆన్‌లైన్ చేయాలని తహశీల్దార్‌ను కలిశామన్నారు. సర్వే చేసిన తర్వాత 1.25 ఎకరాలు రిజిస్టర్ అయిందని, మిగిలినది లేదని తమ దృష్టికి రెవెన్యూ అధికారులు తీసుకువచ్చారని తెలిపారు. ఇది వాస్తవమేనని, తమ అనుభవంలో ఉన్నట్లు సర్వేయర్ రిపోర్టు కూడా ఇచ్చారని పేర్కొన్నారు. 20 సంవత్సరాల నుంచి తమ భూమి జోలికి ఎవరూ రాలేదని ఇప్పుడు తమదంటూ కొందరు వచ్చి దౌర్జన్యానికి పాల్పడడం బాధాకరమని చెప్పారు. తమ ఆధీనంలో ఉన్న భూమిని ఎవరు ఆక్రమించాలని చూసినా చట్ట ప్రకారం ఎదుర్కొంటామని తెలిపారు.

సర్వేను అడ్డుకోవడం దారుణం

ప్రజాశక్తి - కడప అర్బన్ : భూ సర్వేకు ఫాతిమా కళాశాల యాజమాన్యం అడ్డు తగలడం దారుణమని హైదరాబాదుకు చెందిన దీప తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడప మండల పరిధిలో తన భర్త, తాత, కడపకు చెందిన నరసరామయ్యకు 2.52 ఎకరాల స్థలం ఉండేదని పేర్కొన్నారు. అందులో 2006లో 1.27 ఎకరాల స్థలం ఫాతిమా ఎడ్యుకేషన్ సొసైటీకి విక్రయించారని తెలిపారు. మిగతా స్థలం సర్వే కోసం కోర్టును ఆశ్రయించగా, సర్వేకు అనుమతించారని పేర్కొన్నారు. శుక్రవారం సర్వే కోసం వెళ్లగా ఫాతిమా ఎడ్యుకేషన్ సొసైటీ సర్వే నిర్వహించకుండా అడ్డుకున్నారని చెప్పారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. సమావేశంలో కృష్ణయ్య, లక్ష్మీ ప్రసాద్ పాల్గొన్నారు.


స్వచ్ఛ సర్వేక్షన్‌లో కడపకు 3వ స్థానం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కడప అర్బన్

స్వచ్ఛ సర్వేక్షన్ 2024-25 ఫలితాల్లో దేశవ్యాప్తంగా 31వ స్థానం, రాష్ట్రవ్యాప్తంగా 3 వ స్థానంలో స్వచ్ఛ కడపగా నిలిచిందని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. ద్వారకా నగర్‌లోని ఆమె నివాసంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాదిగా మన కడప, స్వచ్ఛ కడప కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి వారానికి రెండు డివిజన్లు ఎంచుకుని, మూడు డివిజన్లు పరిశీలించడంతో మూడవ స్థానం సాధించామని, కడపకు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. పబ్లిక్ టాయిలెట్స్ ఉన్నాయని అయితే పరిశుభ్రత లేదని, పరిశుభ్రత దిశగా దృష్టి సారించాల్సి ఉందన్నారు. కెసి కాలువలో అపరిశుభ్రతలు తొలగింప చేస్తామని, గత ప్రభుత్వం 4 లక్షల టన్నుల చెత్తను వదిలేసి వెళ్లిందని పేర్కొన్నారు. మరింత శుభ్రమైన, ఆరోగ్యకరమైన కడప గా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ తమ పాత్రను పోషించాలని పిలుపునిచ్చారు. కార్మికుల సమ్మె కారణంగా నీటి సమస్య తలెత్తుతుందని, ప్రభుత్వం స్పందించి వారి సమస్యలు పరిష్కరిస్తుందని ఆమె చెప్పారు.

రిమ్స్‌లో మౌలిక వసతులు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్



రిమ్స్ అడ్మినిస్ట్రేటర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

కడప నగర పరిధిలో ఉన్న రిమ్స్‌లో మౌలిక సమస్యలు పరిష్కారించకపోతే ఆందోళన చేయక తప్పదని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ హెచ్చరించారు. శుక్రవారం రిమ్స్ అడ్మినిస్ట్రేటర్ రంగ స్వామిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ రిమ్స్‌లో విద్యుత్ నియంత్రణ కోసం రూ.75 లక్షలు ఖర్చు పెట్టినా ప్యానెల్ బోర్డు ఆరు నెలలుగా నిరుపయోగంగా ఉందన్నారు. ఫలితంగా తుప్పు పట్టి డబ్బులు వృథాగా పోతుందన్నారు. విద్యుత్ వినియోగం పెరగడం వల్ల నియంత్రణ కోసం ప్యానల్ బోర్డు కీలక పాత్ర పోషిస్తుందన్నారు. లిఫ్ట్ ఆగిపోవడం, ఆపరేషన్ థియేటర్లో విద్యుత్ హెచ్చు, తగ్గులు రావడం, వెంటిలేటర్లు సక్రమంగా పనిచేయకపోవడం, బ్యాటరీలు దెబ్బ తినడం లాంటి సమస్యలు లేకుండా పోతాయని చెప్పారు. దీన్ని తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. రిమ్స్‌కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు, సంబంధికులు మంచినీటి సమస్య కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫైర్ సేఫ్టీ పరికరాలు, నీటి పైపుల లీకేజీ, దెబ్బతిన్న గోడలను బాగు చేయడం లాంటి సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని వారు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా ఉందని, దాన్ని తక్షణమే మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కడప కార్పొరేషన్ నుంచి రిమ్స్‌కు నీటిని సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రిమ్స్ బయట ఏర్పాటు చేసిన క్యాంటీన్ నిర్వాహకులు షిఫ్ట్ పద్ధతి కాకుండా అన్ని దుకాణాలు తెరుచుకునేలా అవసరమైన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వికలాంగుల కోసం కేటాయించిన మరుగుదొడ్లను స్టోర్ రూములుగా వాడుతున్నారని, ఇది సరైనది కాదన్నారు. కాన్పుల వార్డు దగ్గర లిఫ్ట్ పనిచేయడం లేదని, దాన్ని తక్షణమే పనిచేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఉన్న వైద్యుల కొరత సమస్యను తక్షణమే పరిష్కారం చేయాలని తెలిపారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కారం చేయకపోతే రానున్న కాలంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, కుమారస్వామి రెడ్డి, నరసింహ, మధు పాల్గొన్నారు.

కడప ఉక్కు కోసం ఢిల్లీలో ధర్నా

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగ సంస్థ సెయిల్ ఆధ ్వర్యంలో నిర్మి ంచాలని కోరుతూ కడప ఉక్కు పట్ల కేంద్రం తీరును నిరసిస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలో జంతరంతర్ వద్ద నిరసన తెలియజేశారు. విభజన హామీలో స్పష్టంగా, చట్టబద్ధంగా రాసుకున్న కడప ఉక్కును కేంద్రం పూర్తిగా విస్మరించిందని డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని వీరనాల శివకుమార్ పేర్కొన్నారు. మోడి ప్రభుత్వం గడిచిన మూడు దఫాలుగా అధికారంలోకి వచ్చినా కడప ఉక్కుకు నిధులు కేటాయించలేదంటే మన పట్ల ఏ స్థాయిలో వివక్షత ఉందో అర్థం అవుతుందన్నారు. ముఖ్యమంత్రులు, మారుతూ శంకుస్థాపనలు చేస్తున్నారే కానీ ఉక్కు పనులు ఒక్కరు మొదలెట్టలేదన్నారు. ఈ ప్రాంత యువత పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కడప ఉక్కు కు కేంద్రంతో కొట్లాడి నిధులు రాబట్టాలని డిమాండ్ చేశారు. రాబోవు రోజులలో కడప ఉక్కు కోసం జాతీయ స్థాయి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆదిల్, జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, నాయకులు సురేంద్ర, పిచ్చయ్య, శివ పాల్గొన్నారు.



ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు



విద్యార్థులు, తల్లిదండ్రులనుద్దేశించి మాట్లాడుతున్న చంద్రఓబుల్‌రెడ్డి

అత్యాధునిక విద్యా బోధన

ప్రజాశక్తి-కడప అర్బన్ : కందుల విద్యాసంస్థల్లో అత్యాధునిక విద్యా బోధన అందిస్తున్నామని ఎమ్‌డి డాక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కందుల మేనేజ్‌మెంట్, పేరెంట్స్ పరస్పర అవగాహన సదస్సు కెఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. బి టెక్ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థినీ విద్యార్థుల తల్లితండ్రులతో ముఖా ముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి కమ్యూనికేషన్, నైపుణ్యాభివృద్ధి, లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం, అచంచలమైన మద్దతును అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. విద్యలో తల్లిదండ్రుల ప్రమేయం, ప్రాముఖ్యత అవసరమని చెప్పారు. పిల్లలకు మొదటి ఉపాధ్యాయులుగా తల్లిదండ్రులదే కీలకపాత్ర అన్నారు. ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ స్కిల్స్, భావోద్వేగ అభివృద్ధి, హోలిస్టిక్ గ్రోత్ కోసం సహకరించాలని పేర్కొన్నారు. ఇంటరాక్టివ్ లెర్నింగ్ యాక్టివిటీస్, రియల్ టైమ్ మానిటరింగ్ పరస్పరంగ ఉంటే విద్యార్థిని విద్యార్థులు అభివృధి త్వరిత గతిన సాదించచ్చు అన్నారు. కళాశాల డీన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ రాయపాటి నాగరాజు మాట్లాడుతూ ప్లేస్ మెంట్ ఉద్యోగ కల్పన కోసం అవసరమైన టెక్నికల్ నాలెడ్జ్, ట్రైనింగ్, హైయేస్ట్ ప్యాకేజీ వివరాలు తెలిపారు. ఫుల్ స్టాక్ డెవలప్మెంట్ విత్ ఆర్టిఫిషియల్ లెర్నింగ్, అడ్వాన్స్ సర్వీస్ నౌ సర్టిఫికేషన్ కోర్స్ ఫర్ కోరే లెర్నింగ్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, బ్రాంచేస్ కోర్ కోర్స్ ట్రైనింగ్, సెమిస్టర్ సర్టిఫికేషన్ కోర్స్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలోప్రిన్సిపల్ వి.ఎస్.ఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి. ఎన్.ప్రసాద్ డీన్ ఫ్యాకల్టీ డాక్టర్ రామ్ ప్రకాష్ రెడ్డి, వివిధ విభాగాధిపతిలు, బోధన, భోదనేతర సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు డ్రగ్స్‌పై సూచనలు ఇస్తున్న సిఐ నరసింహులు

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సిఐ నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో యాంటి డ్రగ్స్, ట్రాఫిక్, సైబర్ క్రైమ్ వాటిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించాలంటే క్రమ శిక్షణ ముఖ్యమని చెప్పారు. చెడు అలవాట్లకు లోనయితే భవిష్యత్తు నాశనం అవుతుందని చెప్పారు. చెడు అలవాట్లుకు బానిస కాకుండా రోజూ పాఠశాలకు వచ్చి శ్రద్ధగా చదువు కోవాలని కోరారు. చిన్న పిల్లలు మోటర్ బైకులు నడిపి ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించవద్దని చెప్పారు. ప్రమాదాలు జరిగితే మీతోపాటి తల్లిదండ్రులు కూడా నష్టపోతారని అన్నారు. సెల్ ఫోన్ ద్వారా చాలా వ్యసనాలకు గురి అవుతున్నారని కాబట్టి సెల్ ఫోన్ జోలికి పోరాదని చెప్పారు. చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులు పాల్గొన్నాలని చెప్పారు. వ్యసనాలకు బానిస కావడం వల్ల సైబర్ క్రైమ్‌లకు పాల్పడుతున్నారని, కాబట్టి వాటి జోలికి కూడ వెళ్లరాదని చెప్పారు. బాల్యం నుండే మంచి క్రమశిక్షణ అనేది ఉంటే మంచి స్థాయిలో ఉండే అవకాశం ఉంటుందని చెప్పారు. అయా హోదాలో ఉన్న అధికారులను, క్రీడాకారులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నారాయణమ్మ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : మత్తు రహిత సమాజ నిర్మాణానికి మనందరం కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పట్టణ సిఐ చాంద్ బాషా పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు అధ్యక్షతన స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు మాదక ద్రవ్యాల నిర్మూలన పై శుక్రవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో స్నేహం మాటున సరదాగా మత్తు అలవాటు తో నేటి యువత భవిష్యత్ ప్రశ్నార్ధకంగా మారుతోందని చెప్పారు. అని ఇలాంటి తరుణంలో మనందరం కలిసికట్టుగా మత్తు రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సర్జన్ డాక్టర్ సుకన్య, కళాశాల వైస్ ప్రిన్సిపల్ బాల నారాయణ, ఉమెన్స్ సెల్ కో-ఆర్డినేటర్ విజయలక్ష్మి, ఎన్‌ఎస్-ఎస్ కో - ఆర్డినేటర్ లిఖిత, సృజన,సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.



అధ్వానంగా ఉన్న కొత్త పత్తూరు ప్రధాన వీధి

కొత్త పత్తూరు సమస్యలను పట్టించుకోండి సారూ.!

ప్రజాశక్తి-ఖాజీపేట

కొత్తపత్తూరులో నెలకొన్న సమస్యలను పట్టించుకుని పరిష్కరించాలని గ్రామస్తులు అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక నిధులను మంజూరు చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం సమస్యలు పరిష్కారానికి నోచుకో లేకపోతున్నాయి. ప్రభుత్వ నిధులు ఖర్చవుతున్నా, సమస్యలు మాత్రం పరిష్కారం కాలేకపోతున్నాయని ప్రజలు పాపోతున్నారు. మండల పరిధిలోని పత్తూరు పంచాయతీ కొత్త పత్తూరులో సమస్యలు తిష్టవేశాయి. ప్రధాన వీధి పూర్తిగా ధ్వంసం అయింది. నూతనంగా సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఏళ్ల తరబడి విన్నవించుకుంటున్నా ఫలితం లేకుండా పోయింది. చిన్నపాటి వర్షం వస్తే వర్షపు నీరు రోజుల తరబడి నిలువ ఉంటుంది. మురుగు నీరు బయటికి వెళ్లేందుకు డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులో లేదు. మురుగునీరు నిల్వ వల్ల దోమలు సంతతి ఎక్కువ అవుతుందని జ్వరాలు ప్రబలే ఆస్కారం లేకపోలేదని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టి సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదులపై తక్షణం స్పందిస్తాం

ప్రజాశక్తి- ఖాజీపేట

మండల వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను తమ శాఖ అధికారుల దృష్టికి తీసుకొస్తే తప్పక పరిష్కరిస్తామని మైదుకూరు విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల నుంచి ఐదు ఫిర్యాదులు అందాయని వాటికి త్వరలోనే పరిష్కార మార్గం చూపుతామన్నారు. ప్రతినెలా మండలం వారీగా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యుత్ ఎఇ నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.


క్రైం కార్నర్

అదుపు తప్పి లారీ బోల్తా

- డ్రైవర్, క్లీనర్ దుర్మరణం

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప- తాడిపత్రి ప్రధాన రహదారిలోని గంగాదేవిపల్లె సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున పైపుల లోడుతో వస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా కొట్టి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బళ్లారికి చెందిన డ్రైవర్ కమల్ సాహెబ్ (64), క్లినర్ ఫక్రుద్దీన్ (45) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఎస్ఐ మైనుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటకకు చెందిన లారీ పైపులు లోడుతో బళ్లారి నుండి చెన్నైకి బయలుదేరింది. ముద్దనూరులోని ఓబుళాపురం-గంగాదేవిపల్లి సమీపం వద్దకు రాగానే లారీ అదుపు తప్పి బోల్తా పడి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ప్రమాదంలో డ్రైవర్ కమల్ సాహెబ్, క్లినర్ ఫక్రుద్దీన్ అక్క డికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో లారీ ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యి క్లినిర్ మృతదేహం లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయింది. లారీ యజమాని అమీర్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రమాదంలో మృతిచెందిన క్లీనర్, డ్రైవర్

ముమ్మరంగా పసుపు సాగు

ప్రజాశక్తి -చాపాడు

పది రోజులుగా రైతులు పూర్తిగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పసుపు సాగు ముమ్మరం చేశారు. కుందూ పరిధిలో రైతులు దుక్కిళ్ళు, వరి నారు సాగుకు ఏర్పాట్లు, కాలువలలో పూడికతీత, నారుమడి కయ్యల ఏర్పాటు వంటి పనులలో పూర్తిగా నిమగ్నమయ్యారు. పంటపొలాలలో రైతులు పసుపు సాగు చేస్తూ కనిపిస్తున్నారు. వర్షాలు ఆశించిన స్థాయిలో పడనప్పటికీ సాగుకు సమయం ఆసన్నం కావడంతో బోరు బావులు, కుందూ నీటిని ఆధారంగా సాగు చేపడుతున్నారు. కుందూ పరిధిలో వరి పంట సాగు చేసేందుకు రైతులు నిమగ్నమయ్యారు. మండల పరిధిలో గత ఏడాది 250 ఎకరాలలో పసుపు పంట సాగైంది. ఈ ఏడాది సాగు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం విత్తనపు ధర పుట్టి (300కిలోలు) రూ. 7వేల వరకు పలుకుతుంది. ఎకరాకు ఐదు పుట్ల వరకు రైతులు సాగుకు ఉపయోగిస్తున్నారు. విత్తనపు పసుపును గత ఏడాది సాగు చేసిన రైతులు నుండి సేకరిస్తున్నారు. మైదుకూరు మండలం కెసి లింగాయపల్లి, బండి వారి పల్లి, ఉత్సలవరం, గంజికుంట ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. ఎకరా సాగుకు కూలీలు, విత్తనం, కాడెద్దులు తో కలిపి రూ. 60 వేల వరకు ఖర్చులు అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు . వర్షాలు తక్కువగా పడినప్పటికీ పసుపు సాగుకు అదును దాటుతుందని రైతులు ముమ్మరంగా సాగుచేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో పడినటువంటి వర్షాలకు శ్రీశైలం రిజర్వాయర్‌కు పూర్తి స్థాయిలో నీరు వచ్చి చేరడంతో కెసికి ముందస్తుగా నీరు విడుదల చేశారు. దీంతో 18వేల ఎకరాలలో వరి పంట సాగు జరగవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. చాపాడు, సీతారామాపురం, అల్లాడుపల్లె, కేతవరం, చియ్యపాడు తదితర గ్రామాలలో పసుపు సాగు చేపడుతున్నారు.



కేతవరం వద్ద కాడెద్దులతో పసుపు పంట సాగు చేస్తున్న రైతులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- జోనల్ మలేరియా అధికారి డాక్టర్ జమాల్ బాషా



మలేరియా అవగాహన ర్యాలీని తనిఖీ చేస్తున్న డాక్టర్ జమాల్ బాషా

ప్రజాశక్తి- కడప అర్బన్

ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రై డేగా పాటిస్తూ నీరు నిల్వ లేకుండా శుభ్రం చేసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ జమాల్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం మసాపేటలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి ఒకసారి ప్రతి ఒక్కరూ ఇళ్లలోని తొట్లు, కుండలు, బానలు శుభ్రం చేసుకోవాలని చెప్పారు. రాత్రి పూట దోమ తెరలు వాడాలని చెప్పారు. సాయంత్రం వేళలో ఇంటికి తలుపులు, కిటికీలు వేసుకోవడం వల్ల దోమ కాటు నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఎఎన్‌ఎంలు రోజూ గ్రామాలకు వెళ్లి జ్వరం వచ్చిన వారి నుంచి రక్త పూతలు తీయాలని చెప్పారు. తర్వాత ఆయన కాలనీలో పర్యటించి డెంగీ జ్వరాల పట్ల అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో నిత్య పూజయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి నాగలక్ష్మి రెడ్డి, సబ్ యూనిట్ అధికారి, జోనల్ మలేరియ ఆఫీస్ సిబ్బంది, ఎఎన్‌ఎం లు, ఆశాలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : వర్షాకాలం రాబోతుండడంతో పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ప్రజలకు సూచించారు. శుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమల బెడద ఉండదని తెలిపారు. శుక్రవారం పట్టణంలోని క్రాంతి నగర్‌లో ఆయన ప్రజలతో మాట్లాడారు. నీటిని కాచి వడబోసి చల్లార్చిన తర్వాత తాగాలని తెలిపారు. పట్టణంలో ప్రజలకు రెండు ప్రభుత్వ ఆసుపత్రులు సమీపంలో ఉన్నాయని , ఇందులో ఉచిత వైద్యాన్ని సద్వినియోగం సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, అర్బన్ వైద్యశాల డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, సూపర్‌వైజర్ ఓబులేసు, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని వైద్యాధికారి డాక్టర్ నల్లబెల్లి హిమబిందు అన్నారు. జాతీయ డెంగీ మాసోత్సవం సందర్భంగా పట్టణంలోని టిబి రోడ్డులో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ అన్ని సచివాలయ పరిధిలో డ్రై డే పాటిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. మలేరియా, డెంగ్యూ జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వారానికి ఒకసారి ఇళ్లలోని తొట్లు, కుండలు, బానలు ,కూలర్లు శుభ్రం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ సాధు శ్రీనివాసులు, సిఎంఒ వి.సుబ్బారెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాలు టిడిపి నాయకులు

సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - వేంపల్లె : ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక క్రిష్టియన్ కాలనీలో టిడిపి ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఎడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిన పథకాలకు సంబంధించి కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎడాదిలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నేతలు మహమ్మద్ ఇనాయతుల్లా, ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, వేమకుమార్, డక్కా రమేష్, జబిబుల్లా మడక శ్రీనివాసులు, సెట్, బాలకృష్ణారెడ్డి తో పాటు నాయకులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో వాసవీమాత

ప్రజాశక్తి-వేంపల్లె : స్థానిక వైఎస్‌ఆర్ మెయిన్ బజార్‌లోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో వాసవీమాతా శాకాంబరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం కన్యకాపరమేశ్వరి ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వాసవి మాతాకు పంచామృతాలఅభిషేకం, కుంకుమార్చన, నివేదన, మంత్రపుష్పం, మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం కర్ణాటక నుండి ప్రత్యేకంగా తెప్పించిన పండ్లు, కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా ఆలంకరణ చేశారు. ప్రజలకు తీర్థ ప్రసాదాలు అందజేసి అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తొటం శెట్టి చంద్ర శేఖర్, యవజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ, ఆలయ నిర్వాహకులు మిట్టా మోహన్ రావు, కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. **చాపాడు :** మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానం ఆవరణలో ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా భద్రకాళి అమ్మవారి శాకంబరీ అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరు నారాయణ యాదవ్, ఇఒ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆలయ పూజారులు భద్రకాళి అమ్మవారిని ప్రత్యేకంగా పండ్లు కూరగాయలతో అలంకరించారు. పంచామృత అభిషేకం, గణపతి పూజ, మంగళహారతి, సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

బెల్ట్ షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం

బ్రహ్మంగారిమఠంలో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో బెల్ట్‌షాపులు అధికమవుతున్నాయని దీంతో ఏ సమయమైనా మద్యం అమ్మకాలు విక్రయిస్తున్నారని చెప్పారు. దీంతో మందుబాబులు ఆలయానికి వచ్చే యాత్రికులను సైతం ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. రోడ్ల మీద, గుడిలో పడిపోవడం సంఘనలు చోటు చేసుకుంటున్న్యాన్నారు. కొంతమంది విచ్చల విడిగా తాగి వచ్చేటువంటి యాత్రికులను నోటికి వచ్చినట్లు తిడుతూ వారిని బాధపెడుతున్నారని వారన్నారు. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు అధికారులకు తెలిసిన కూడా పట్టించుకోకపోవడం దారుణమని వారన్నారు. పుణ్యక్షేత్రంలో మద్యం అమ్మకాలు నిర్వహించకూడదనే నిబంధన ఉన్నప్పటికీ ఐదు రోడ్ల కుడలిలోనే బెల్ట్ షాపులను పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. మండల, స్థానిక నాయకుల అండదండలతో అనుమతితోనే ఇష్టానుసారంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని వారు ఆరోపించారు, బెల్ట్ షాపులకు కుతావేట దూరంలోనే బాలికల పాఠశాల, ప్రవేట్ స్కూల్ ఉన్నాయని ఈమార్గంలోనే విద్యార్థులకు పాఠశాలకు వెళ్తుంటారన్నారు. చిన్న పిల్లలను పిలుచుకుని తల్లులు వస్తారని, విద్యార్థులకు, మహిళలకు మందు బాబుల నుండి రక్షణ కరువయ్యే ప్రమాదం ఉందని వారు అన్నారు. ఇప్పటికైనా ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో బెల్ట్ షాపులను పూర్తిస్థాయిలో లేకుండా చేయాలని ఇందుకు ఎక్సైజ్, పోలీసు శాఖలు కఠినచర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ప్రజలందరినీ ఐక్యం చేసి ఆందోళన పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో మండల కమిటీ సభ్యులు గోవింద్, హరి, సుబ్బమ్మ, అజయ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

కృష్ణా నదిపై అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలి

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కృష్ణానదిపై నిర్మించే తెలంగాణ అక్రమ ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం అడ్డుకోవాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హంద్రీ నీవా విషయంలో సొమ్ము ఒక్కరిది సోకు ఒక్కరిది అన్నట్లుందని ఎద్దేవా చేశారు. అనంతపురం జిల్లా ఒడి చెరువు వద్ద 1983లో ఎన్‌టిఆర్ ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని చెప్పారు. 2004 వరకు 21 సంవత్సరాలలో ఈ ప్రాజెక్టు పై ఖర్చు చేసింది కేవలం రూ 13.75 కోట్లు మాత్రమేనని చెప్పారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ ప్రాజెక్టు పనులు ఊపందుకున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టును జలయజ్ఞం కింద చేర్చినట్లు చెప్పారు. 2005లో ఉరవకొండ వద్ద కాంగ్రెస్ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి శంకు స్థాపన చేశారని తెలిపారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి 834 అడుగుల ఎత్తు నుండి రోజుకు 3850 క్యూసెక్కుల నీటిని 120 రోజుల పాటు తీసుకొని 40 టిఎంసిలతో రాయలసీమలో 6.02 లక్షల ఎకరాలకు సాగు నీరు, 33 లక్షల మందికి త్రాగు నీరు అందించే విధంగా రూప కల్పన చేశారన్నారు. కాంగ్రెస్ హయాంలో రూ 6948 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. రెండవ దశలో 80 శాతం పనులు పూర్తి అయినట్లు చెప్పారు. 2012లోనే అనంతపురం జిల్లాలో జీడిపల్లి రిజర్వాయర్‌లో నీళ్లు నింపి జాతికి అంకితం చేసినట్లు తెలిపారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి 795 అడుగుల నుంచి హంద్రీ నీవా ప్రధాన కాలువలోకి నీళ్లు ఎత్తి పోసే విధంగా 2007 ఆగస్టు 31 న ముచ్చుమర్రి ప్రాజెక్టుకు శంకు స్థాపన చేసి 90 శాతం పనులు కాంగ్రెస్ పాలన లో పూర్తి చేసినట్లు చెప్పారు. కూటమి పాలనలో కొంచెం విస్తరణ, లైనింగ్ పనులు మాత్రమే జరిగినట్లు చెప్పారు. తానే శంకుస్థాపన చేసినట్లు, పూర్తి చేసినట్లు, ప్రారంభం చేసినట్లు చంద్రబాబు డబ్బా కొట్టుకోవడం హాస్యాస్పదమని తులసిరెడ్డి అన్నారు. పోలవరం బనకచర్ల ప్రాజెక్టును తెలంగాణా ప్రభుత్వం ఒప్పుకుంటే కృష్ణా, గోదావరి నదులపై తెలంగాణా ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడ్డు చెప్పదని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం సమంజసం కాదని చెప్పారు. సాగర్, కృష్ణా, డెల్టాకు నీరు అందక రాయలసీమతో పాటు రాష్ట్రం ఎడాది అవుతుందని చెప్పారు. పోలవరం - బనకచర్ల ప్రాజెక్టు కోసం ఆంధ్ర ప్రదేశ్ ను తెలంగాణాకు తాకట్టు పెట్టవద్దని, రాష్ట్రాన్ని ఎడారి చేయవద్దని తులసిరెడ్డి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

నాణ్యమైన విద్యను అందించాలి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసి ఉపాధ్యాయుల హాజరు పుస్తకాన్ని పరిశీలించారు. పిర్యాదులు వచ్చాయని, పొరపాట్లు పునరావృతం కాకుండా చూసుకోవాలని, లేనియెడల శాఖపరమైన చర్యలు తప్పవని ఆదేశించారు. భోజనం సరిగ్గా పెడుతున్నారా, చదువు బాగా చెపుతున్నారా అని విద్యార్థులును అడిగి తెలుసుకున్నారు. పేద విద్యార్థులకు ఆరోగ్యవంతమైన జీవనంతో పాటు నాణ్యమైన విద్యనందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న విద్యార్థితో మాట్లాడి అతని ఆరోగ్య సమస్యపై ఆరా తీశారు. కడప రిమ్స్‌లో చికిత్స చేయిస్తానని విద్యార్థికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తూగుట్ల రాఘవ రెడ్డి , టిడిపి నాయకులు ముచ్చుమర్రి మహేష్, జ్ఞానేశ్వర్ నాయుడు, మల్లెల శ్రీను పాల్గొన్నారు.

సొంత పార్టీ నాయకులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి -చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మాజీ ఎమ్మెల్యే తన సొంత పార్టీ (వైసిపి) నాయకులకు న్యాయం చేసి టిడిపి వారి గురించి మాట్లాడాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎపి రవీంద్ర ఎద్దేవ చేశారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ధనపాల జగన్‌కు ఇవ్వాల్సిందని మాజీ ఎమ్మెల్యే రఘురాంరెడ్డి పేర్కొనడం ఏమాత్రం సమంజసంగా లేదన్నారు. ఏ పదవి ఎవరికి ఇవ్వాలన్నది పార్టీ అంతర్గత నిర్ణయం అన్నారు. ధనపాల జగన్‌కు ఆర్థికంగా, రాజకీయంగా అన్యాయం చేసింది రఘురామి రెడ్డి అని గుర్తు చేశారు. పార్టీ సమన్వయకర్తగా ఉన్న మాజీ ఎమ్మెల్యే కుమారుడు నాగిరెడ్డి ఎన్నికల అనంతరం ఏ కార్యక్రమంలో పాల్గొనలేదన్నారు. ఆ పదవిని పార్టీ కోసం కష్టపడే రాచమల్లురవికి కానీ, గంగాధర్‌కు కానీ ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. తమ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిని ఇంటి వద్ద నుండి తీసుకెళ్లి తమ చైర్మన్ అభ్యర్థిపై కిడ్నాప్ కేసు పెట్టించారన్నారు. మైదుకూరు నియోజకవర్గ వైసిపి కార్యకర్తలు ఆర్థికంగా ఇబ్బంది పడే తమ ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ దరిన చేరారని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పాశం మారుతి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. **వైసిపి కౌన్సిలర్ల సహకారం అవసరం లేదు..** టిడిపి కౌన్సిలర్ అభ్యర్థిని చైర్మన్‌గా చేసేందుకు వైసిపి కౌన్సిలర్ల సహకారం అవసరం లేదని 15వ వార్డు కౌన్సిలర్ టిడిపి నాయకుడు కుర్ర రాధాకృష్ణ పేర్కొన్నారు. టిడిపి కౌన్సిలర్లతో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి టిడిపి నాయకుల పట్ల కపట ప్రేమ చూపడం విడ్డూరంగా ఉందన్నారు. చైర్మన్ ఎన్నికకు అవసరమైన సభ్యులు ఉన్నప్పుడే ఎన్నుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ యార్డ్ చైర్మన్

సిఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధితులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని బాధితులకు మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ 37 మందికి రూ.36,41,286 విలువైన ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశామన్నారు. కుటుంబ అవసరాలకు లేదా ఆరోగ్య సమస్యలకు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, బాధితులు పాల్గొన్నారు.

చెత్త ట్రాక్టర్లు తొలగించండి

ప్రజాశక్తి - వేంపల్లె : స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాల సమీపంలో పార్కింగ్ చేస్తున్న చెత్త ట్రాక్టర్లును అక్కడ నుంచి తొలగించాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహమతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాపీర్ కోరారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి మాధవరెడ్డిని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. వేంపల్లెలోని పాత మార్కెట్‌లో రెండు ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలు ఉన్నాయని చెప్పారు. అ పాఠశాలల వద్ద గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్లు పార్కింగ్ చేయడం వల్ల విద్యార్థులకు ఇబ్బందిగా మారిందని చెప్పారు. చెత్త ట్రాక్టర్లు నిలపడం ద్వారా విద్యార్థులకు దుర్వాసన వెదజల్లుతోందని చెప్పారు. దోమలు కూడా ఎక్కువ కావడంతో పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు రోగాల బారిన పడుతున్నట్లు చెప్పారు. చెత్త ట్రాక్టర్లు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రెయినేజీ కాలువలు అన్ని మట్టితో పూడ్చి వేశారని, వాటిపై చర్యలు తీసుకొని కాలువలు శుభ్రం చేసి మురుగు నీరు కాలువల్లో పోయేలా చూడాలని చెప్పారు. వీధిల్లో ఎక్కువగా కుక్కలు ఉన్నాయని, వాటిపైనా దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఆమ్‌ఆద్మీపార్టీ మండల నాయకులు పీరు బాషా, గౌస్, షఫీ, మహమ్మద్, సమీర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి- పులివెందుల టౌన్ : విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఎఇ జగదీశ్వర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని జయమ్మ కాలనీ, లయోలా డిగ్రీ కళాశాల సబ్ స్టేషన్ పరిధిలలో చెట్లు తొలగింపు కార్యక్రమం చేపడుతుండడంతో ఉదయం. 9 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. వినియోగదారులు సహకరించాలని ఎఇ కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - బద్వేలు

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి బద్వేల్ మున్సిపాలిటీ సిబ్బంది కట్టుబడి ఉందని, కమిషనర్ వాకమల్ల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్యక్రమంలో ప్రజలు మౌలిక సదుపాయాలకు సంబంధించి 34 సమస్యలు తన దృష్టికి తీసు కొచ్చారన్నారు. వాటన్నిటిని తక్షణమే పరిష్కరించాలని సెక్షన్ హెడ్‌లను ఆదేశించామని చెప్పారు. వచ్చేవారం నిర్వహించే డయల్ యువర్ కమిషన్ కార్యక్రమం లోపు సమస్యలు సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆదర్శ మున్సిపాలిటీగా తయారయ్యేందుకు తన వంతు చేయూతను అందించాలని కోరారు.